వంటనూనె తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

సిర్పూర్(యు), జనవరి 17: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయ సముదాయంలో వంటనూనె తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఐకేపీలో కొనసాగుతున్న స్వయం సహాయక సంఘాలు పొద్దు తిరుగుడు, వేరు శనగలను అధిక మొత్తంలో సేకరించి వాటి ద్వారా నాణ్యమైన వంటనూనె తయారు చేయాలని కోరారు. అదేవిధంగా నూనెను సరసమైన ధరకు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతు స్వయంసహాయక సంఘాలను వంటనూనె తయారీలో ప్రభుత్వపరంగా ఆర్థికంగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్ర మంలో తోడ్సం భాగ్యలక్ష్మి, డీఆర్డీవో పీడీ సురేందర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆత్రం భగ్వంత్‌రావ్, వైస్‌ఎంపీపీ ప్రకాష్, సర్పంచ్ వీణబాయి, ఏపీఎం వెంకటరెడ్డి, సర్పంచులు పద్మబాయి, లక్ష్మీనాగోరావ్, హీరాబాయి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక'పాలన దిశగా పంచాయతీలు?



- నెలాఖరుతో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- ఎన్నికల నిర్వహణపై అయోమయం
- పార్లమెంట్ ఎన్నికలపైనే పార్టీల ఫోకస్

చింతలమానేపల్లి/వాంకిడి, జనవరి 17 : గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన తప్పేలా లేదు. ప్రస్తుత సర్పంచుల ఐదేళ్ల పదవీకాలం ఈ నెల 31తో ముగియనున్నది. పంచాయతీ ఎన్నికల దిశగా ఇప్పటివరకు ఎలాంటి కార్యాచరణ ప్రారంభించకపోవడంతో పంచాయతీల నిర్వహణ బాధ్యత ప్రత్యేకాధికారులకు అప్పజెప్పడం ఖాయమని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలు పెట్టింది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 335 గ్రామ పంచాయతీలుండగా, 2,874వార్డుల ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బంది వివరాలను గత డిసెంబరులోనే సేకరించింది. ఓటర్ల సంఖ్యను గుర్తించడంతోపాటు 650మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేశారు.

వారికి అవకాశం లేని కొత్త చట్టం

నూతన పంచాయతీరాజ్ చట్టంప్రకారం నిర్దేశిత గడువులోపు ఎన్నికలు నిర్వహించాల్సిందే. లేదంటే ప్రత్యేకాధికారులను నియమించి పల్లెపాలనను కొనసాగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం సర్పంచుల పదవీకాలం పూర్తైన తదనంతరం ఆయాపాలక వర్గాలను పర్సన్ ఇన్‌చార్జులుగా కొసాగించేందుకు కొత్త చట్టం అనుమతించడంలేదు. అలా వారిని నియమించాలంటే అసెంబ్లీలో చట్టసవరణ లేదా ఆర్డినెన్స్‌ను తేవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

రిజర్వేషన్లపై సందిగ్ధం...

పదేళ్లపాటు రిజర్వేషన్లు ఉండేలా నూతన పంచాయతీరాజ్ చట్టంలో పొందు పర్చారు. 2018 సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించిన సమయంలో నిర్దేశించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను పెంచుతామని ఎన్నికల హామీలో ప్రకటించింది. బీసీ గణన చేపట్టి ఆయాగణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు నిర్ధారిస్తామని వెల్లడించింది. పంచాయతీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరిగా కనిపిస్తుంది. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసు కోవాల్సి ఉంది. అప్పటివరకు సం దిగ్ధత కొనసాగుతుంది.

మండల స్థాయి అధికారులతో..

గ్రామపంచాయతీలకు మండల స్థాయి అధికారులను నియమించ నున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం లేని శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేకాధి కారులుగా నియమించాలనే ఆలోచనలో జిల్లా యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మండల పరిషత్‌లోని సూపరింటెండెంట్, ఎంపీవో, వ్యవసాయ అధికారులు, పశు వైద్యాధికారులు, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఏఈలను నియమించనున్నారు. మేజర్ పంచాయతీలకు జిల్లా స్థాయి అధికారులను నియమించేందుకు ప్రణాళి కలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

జిల్లాలో పంచాయతీలు ఇలా..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 15 మండలాల్లో 335గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 2,874వార్డులున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,53,538 ఓటర్లున్నారు. ఇందులో 2,26,666 మంది మహిళలు,2,26,864 మంది పురుషులు ఉన్నారు.



ఎన్నికల నిర్వహణకు సర్కార్ నో..?

జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలు పెట్టినా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. 12రోజుల్లో సర్పంచుల పదవీకాలం ముగుస్తున్నా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచనలు రాలేదని అధికారులు చెబుతున్నారు. పైగా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా లేదని పార్లమెంట్ ఎన్నికల తర్వాత నిర్వహించవచ్చని పేర్కొంటున్నారు. ప్రస్తుత సర్పంచుల్లో జిల్లాలో ఎక్కువ మంది బీఆర్ఎస్ కావడంతో వారి పదవీ కాలం ముగిసిన అనంతరం ప్రత్యేకాధికారులను నియమించాలన్న భావనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. స్పెషలాఫీసర్లుగా నియమించేందుకు అర్హులైన పంచాయతీరాజ్, రెవెన్యూ విభాగాల్లోని జూనియర్, సీనియర్ అసిస్టెంట్లతోపాటు ఎంపీవోలు, ఎంపీడీవోలు, తదితర విభాగాల నుంచి నియమించే అవకాశాలు ఉన్నాయి.

లోక్‌సభ ఎన్నికలే టార్గెట్..

షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి. ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉండడంతో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ, బీఆర్ఎస్, తదితర రాజకీయ పక్షాలు లోక్‌సభ ఎన్నికలపైనే దృష్టి సారించాయి. ఇప్పటికే ఆయాపార్టీలకు చెందిన నాయకులతో సమావేశాలు నిర్వహించడం, ఎన్నికల్లో గెలుపు వ్యూహాలు రచించడంపై ఫోకస్ పెట్టాయి. అయితే ఎన్నికల నిర్వహణపై పంచాయతీ అధికారులతో మాట్లాడితే ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే ఎన్నికలు జరుగుతాయని, ఆలస్యమైతే స్పెషలా ఫీసర్ల పాలన ఉండవచ్చని దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెబుతున్నారు.

ఔత్సాహిక సినీదర్శకులు, రచయితలకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 17: తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా సాంస్కృతిక సమాఖ్య నిర్వహణలో ఈనెల20,21తేదీల్లో మంచిర్యాలలో ఔత్సాహిక దర్శకులు, రచయితలకు ఉచితశిక్షణ శిబిరాన్ని నిర్వహించను న్నట్లు జిల్లాకు చెందిన ప్రముఖ దర్శక నిర్మాత, రచయిత నాగబాల సురేష్‌కుమార్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సినీదర్శకులు తెలుగు దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి వీఎన్ఆదిత్య, ప్రముఖసినీదర్శకులు ఆర్‌ప్రేంరాజ్, ప్రవీణ్‌చందర్, శతచిత్ర రచయిత సాయినాథ్‌తోపాటు పలువురు చలనచిత్ర, టీవీరంగాలకు చెందిన దర్శక, రచయితలు, ప్రముఖులు శిక్షకులుగా పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. చలన చిత్ర, టీవీ రంగాల్లో ప్రవేశించాలనుకుంటున్న ఉమ్మడిజిల్లాలోని ఔత్సాహికులైన దర్శక, రచయితలు ఈ ఉచితశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ సంతోష్ చేతుల మీదుగా శిక్షణార్థు లకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు మంచిర్యాల జిల్లా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్ష,కార్యదర్శులు విశ్వేశ్వరశర్మ, నాగరాజు, కుమరంభీం జిల్లా సాంస్కృతికసమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు డి వెంకటేశ్వర్లు, డి రామారావును సంప్రదించాలన్నారు.

రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి


పెంచికలపేటలో అవగాహన కల్పిస్తున్న బీట్ అధికారి అరుణ్‌రెడ్డి

వాంకిడి/పెంచికలపేట, జనవరి 17: అటవీప్రాంత సమీపంలో సాగు చేస్తున్న రైతులు, వ్యవసాయ పనులకు వెళ్తున్న కూలీలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో అప్పలకొండ, బీట్ అధికారి అరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పులి సంరక్షణలో భాగంగా వాంకిడి మండలం లక్ష్మీపూర్ గ్రామపరిధి అటవీసమీప ప్రాంతంలోని చేన్లలో, పెంచికలపేట మండలం కమ్మర్‌గాం గ్రామంలో రైతులకు పులి ఎదురైతే తీసుకోవాల్సిన చర్యలపై వారు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా చేనుల సమీపం నుంచి వెళ్తున్న విద్యుత్‌తీగలను పరిశీలించారు. అనంతరం జోగాపూర్ గ్రామంలో పులిసంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పత్తితీసే కూలీలు ఒక్కొక్కరుగాకాకుండా గుంపులుగా పనిచేయాలన్నారు. వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు కూడా గుంపుగా రాకపోకలు సాగించాలన్నారు. పత్తి ఏరేటప్పుడు కూలీలలో ఒకరు పెద్దశబ్దాలు చేయాలని సూచించారు.పులి దాడిచేస్తే తక్షణసాయంగా రూ.5వేలు అందజేస్తామన్నారు. మిగితా పరిహారాన్ని పదిరోజుల్లో అందేలా చర్యలు తీసు కుంటామన్నారు. పులులను వేటాడినా, విద్యుత్ తీగలు అమర్చి హతమార్చిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో అతారుద్దీన్, ఎఫ్‌బీవో సాదిక్ పాల్గొన్నారు.

సఖి సేవలపై అవగాహన

సిర్పూర్(టి), జనవరి 17: మండలంలోని నవేగాం, జక్కాపూర్, దుబ్బగూడ తదితర గ్రామాల్లో బుధవారం సఖి అధికారి శ్రీనిధి సఖిసేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గృహహింస, వరకట్నం, తదితరాలపై అవగాహన కల్పించారు. అత్యవసరసేవల్లో 181 నెంబ రును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి ఆపద సమయంలోనైనా సఖి బృందంను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జానాబాయి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 17: క్షేత్రస్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లాఇన్‌చార్జి బాలాజీ, ఎంఎస్పీజిల్లా ఇన్‌చార్జి శ్రీనివాసులు తెలిపారు. జిల్లాకేంద్రంలో బుధవారం వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సంబంధించి మందకృష్ణ తన శక్తియుక్తుల్ని కూడగట్టి ఎప్పటినుంచో పోరాడుతున్నారన్నారు. దీనికి సంబంధించి బుధవారం సుప్రీంకోర్టుతీర్పు వస్తుందని తెలిపారు. తీర్పుఏవిధంగా వచ్చినా అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో మహేష్‌రమేష్‌సాగర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలి

సిర్పూర్(టి), జనవరి 17: గ్రామాభివృద్ధి 2024-25 సంవత్సరానికి గాను ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులకు ఈవో కృష్ణమూర్తి గ్రామపంచాయతీ అభివృద్ధిప్రణాళికపై అవగాహన కల్పించారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హేమంత్ బొర్కడే

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 17: కేవీపీఎస్ నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులవివక్షను రూపుమాపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, మహేశ్వర్, నగేష్, బాబాజీ పాల్గొన్నారు.

నూతన చట్టాలను రద్దు చేయాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న డ్రైవర్లు

జైనూర్, జనవరి 17: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న నూతనచట్టాలను రద్దుచేయాలని ఏజెన్సీలో పనిచేస్తున్న జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల ప్రైవేట్ డ్రైవర్లు బుధవారం మండల కేంద్రంలో సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన చట్టాలను రద్దు చేయాలని మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. అనంతరం డ్రైవర్లసంఘం అధ్యక్షుడు ఇంతియాజ్‌ఖాన్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వెంటనే డ్రైవర్ల కోసం తయారు చేసిన చట్టాలను రద్దు చేయాలని లేనియెడల సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. డ్రైవర్ల సమ్మెకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం మండల ఉపాధ్యక్షుడు షేక్ ఫయాజ్, సెక్రెటరీ అనక సంతోష్,డ్రైవర్లు భుమన్న, చక్రపాణి, షేక్ సద్దాం, బీఆర్ఎస్ నాయకులు కనక యాదవ్‌రావ్, వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, సర్పంచులు మేస్రాం లక్ష్మణ్, మడావి భీంరావ్, సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీ తదిరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర

వాంకిడి, జనవరి 17: మండలంలోని బంబారలో బుధవారం అయోధ్య శ్రీ రాముడి అక్షింతల శోభాయాత్రను భాజాభజంత్రీ లతో ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ దేవ్‌రావు, పీఏసీఎస్ వైస్‌ఛైర్మన్ సేపాజీ, బాపు రావు, సదాశివ్, నాందేవ్, గణపతిపాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్, జనవరి 17: మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లను ఈ నెల 21నుంచి 24వరకు నిలిపివేస్తున్నటు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అదృశ్యమై.. విగతజీవిగా లభ్యం


దుర్గం శేఖర్(ఫైల్)

సిర్పూర్(టి), జనవరి 17: సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన దుర్గం శేఖర్(47) ఈనెల12న కాగజ్‌నగర్‌లో అదృశ్యమవగా బుధవారం మండలంలోని పోడ్సా పెన్‌గంగా వద్ద అతని మృతదేహలం లభించింది. ఎస్సై బొజ్జిరావు తెలిపిన వివరాల ప్రకారం. శేఖర్ ఈ నెల 12న కాగజ్‌నగర్‌లో అదృశ్యం కాగా కుటుంబీకులు కాగజ్‌నగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు, కుటుంబ సభ్యులు వెతకగా పెన్‌గంగా వద్ద మృతదేహం ఉన్నట్లు జాలర్లు సమాచారం అందించారు. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారువెళ్లి చూసి మృతదేహం శేఖర్‌దేనని గుర్తించారు. మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటా డని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి: ఎంపీపీ అరిగెల

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 17: మండలంలోని గుండి వంతెన నిర్మాణపనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. బుధవారం వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ నిర్మాణపనుల్లో అలసత్వం వహించవద్దని, నాణ్యతగా నిర్మించాలన్నారు. ఈ వర్షాకాలం లోపు వంతెన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ భీమేష్, మాజీసర్పంచ్, వైస్‌ఎంపీపీ మంగ, మల్లేష్, సత్తి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి: అదనపు కలెక్టర్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 17: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం, గ్రామపంచాయతీలలో పన్నుల వసూలు నిర్దేశిత లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఏపీవోలతో లక్ష్యాల సాధన ప్రక్రియపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద జాబ్‌కార్డు ఉండి అర్హతగల ప్రతి కూలికి పనికల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఫారం పాండ్ల నిర్మాణాలు, కమ్యూనిటీ ఆస్తులఏర్పాటు, నర్సరీల నిర్వహణపై అధికారులు దృష్టిసారించాలన్నారు. గ్రామపంచాయతీల పరిధిలో మార్చి31 లోగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. గ్రామపంచాయతీల కార్యదర్శులు పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆ దిశగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి కుమార్ హుస్సేన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు చప్రాడకు మహాపాదయాత్ర

బెజ్జూరు, జనవరి 17: మండలంలోని ఎల్కపల్లి అభయాంజనేయస్వామి ఆలయంనుంచి గురువారం మహారాష్ట్రలోని చప్రాడ ఆధ్యాత్మిక కేంద్రానికి 19వ మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5గంటలకు పాదయాత్ర ప్రారంభమై చింతలమానేపల్లి, కౌటాల మండలాల మీదుగా పలు గ్రామాల నుంచి సాయంత్రం చప్రాడకు చేరుకోనుంది. చప్రాడలో బసచేసే భక్తులకు రాత్రి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు. 19న దత్తావతార్ కార్తీక్ మహారాజ్ చిత్రపటానికి పాదపూజ, ఇతర కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం కాగజ్‌నగర్ షణ్ముఖ హాస్పిటల్, బెజ్జూరు ఆర్‌ఎంపీ పీఎంపీ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నారు.

అధికారుల సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం


నామినేషన్లు సమర్పిస్తున్న అధికారులు



శ్రీరాంపూర్, జనవరి 17: అధికారుల సంఘం ఎన్నికలప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల28న పోలింగ్‌జరుగనుండగా, శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో బుధవారం పలువురు అధికారులు పెద్ద ఎత్తున నామినేషన్లు వేశారు. శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్ష పదవికి జగ్గారెడ్డి, కేవీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పదవికి మల్లయ్య, చంద్రశేఖర్, ఉపాధ్యక్ష పదవికి కిరణ్‌కుమార్, రాజారవిచరణ్, తిరుపతి, అమర్‌నాథ్, కోశాధికారి పదవికి రాము, పద్మ, సంయుక్త కార్యదర్శి పదవికి భీమన్న, పాషా తమ నామినేషన్లు సమర్పించారు. అలాగే సింగరేణి స్థాయి అధ్యక్ష స్థానానికి ఏవీరెడ్డి, ఉపాధ్యక్ష స్థానానికి అబ్దుల్ ఖాదిర్ నామినేషన్లు వేశారు.

షెడ్యూల్ ఇలా..

ఈనెల17నుంచి19వరకునామినేషన్ల దాఖలు, 20, 21న నామినేషన్ల ఉపసంహరణ, 22న దాఖలైన నామినేషన్ల స్క్రూటినీ చేసి, 23న తుది జాబితా రూపొందిస్తారు. ఈనెల 28న ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్, ఆ తదుపరి లెక్కింపు ప్రారంభమవుతుంది. తుది ఫలితాల ప్రకటన 29న ఉంటుంది. ఎన్నికైన వారికి 30న ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. ఈ ఎన్నికల్లో ఏరియా అధ్యక్షుడిని, కంపెనీ వ్యాప్తంగా అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు అధికారులు రెండు ఓట్లు వేయనున్నారు.

పీఎల్ఆర్ బోనస్ చెల్లింపు పట్ల హర్షం

కాసిపేట, జనవరి 17: సింగరేణి రిటైర్డు కార్మికులకు లాభాలవాటా 32శాతం, పీఎల్ఆర్ బోనస్ చెల్లించేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకోవడంపై ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగా సింగరేణి యాజమాన్యం రిటైర్డు కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించడానికి ముందుకు వచ్చిందన్నారు. లాభాలవాటా 32శాతం, పీఎల్ఆర్ బోనస్, వేజ్‌బోర్డు ఏరియర్స్‌ను ఫిబ్రవరి 6లోగా చెల్లించనున్నట్లు యాజమాన్యం పేర్కొనడం ఆనందంగా ఉందన్నారు.

రిటైర్డ్ కార్మికులకు లాభాలవాటా, దీపావళి బోనస్

- ఈ నెల 19, 21 తేదీలలో చెల్లింపునకు సర్క్యులర్లు జారీ

శ్రీరాంపూర్, జనవరి 17: అర్హత గల రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, పీఎల్ఆర్(దీపావళి) బోనస్ చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు అవసరమైన సర్క్యులర్లను బుధవారం సంస్థ పర్సనల్ జీఎం విడుదల చేశారు. 2022-23ఆర్థిక సంవత్సరం(ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు)తో పాటుగా తేది: 01-10-23నాటికి నామినల్‌రోల్స్‌లో ఉన్న ఎన్‌సీ డబ్ల్యూఏ ఉద్యోగులు/ ఎగ్జిక్యూటివ్‌లకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 32శాతం లాభాల వాటాను ఈనెల 19న చెల్లించేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. అర్హులైన వారందరికీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. అయితే రిటైర్డ్ ఉద్యోగులు, నామినీలు మరణించినా, బ్యాంకు ఖాతాలు సక్రమంగా లేకపోయినా వారికి చెక్కుల రూపంలో డబ్బులు అందించనున్నారు. రిటైర్డ్ ఉద్యోగులు/ నామినీలకు వచ్చే లాభాలవాటా నుంచి బకాయిలను, సీపీఆర్ఎంఎస్‌కు అవసరమైన డబ్బును మినహాయించడానికి అధికారులు నిర్ణయించారు.

దీపావళి బోనస్ కూడా..

గతేడాది అక్టోబర్‌8న ఢిల్లీలోని కోల్ ఇండియా కార్యాలయంలో కోల్‌ఇండియా, సింగరేణి, ఇతర బొగ్గు కంపెనీల యాజమాన్యాలతో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో 2022-23ఆర్థిక సంవత్సరానికి దీపావళి బోనస్ రూ.85వేలు చెల్లించేందుకు నిర్ణయించారు. ఇది2021-22ఆర్థిక సంవత్సరం మార్గదర్శకాలకు అనుగుణంగా రిటైర్డ్ ఉద్యోగులు(నాన్ ఎగ్జిక్యూటివ్‌లు)/నామినీలకు చెల్లించనున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం(ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు)తో పాటుగా ఏప్రిల్ 1, 2023 నుండి అక్టోబర్ 31, 2023 వరకు మరణం/ఉద్యోగ విరమణ/రాజీనామా/మెడికల్ అన్‌ఫిట్ అయిన వారు అర్హులుగా పరిగణించబడతారు. గని/విభాగాల అధిపతుల ద్వారా పేషీట్లు పరిశీలించి, ధ్రువీకరించిన తరువాత వారి హాజరును బట్టి ఒక్కో ఉద్యోగికి చెల్లించాల్సిన పీఎల్ఆర్ బోనస్‌ను రూ.85 వేలకు మించకుండా చెల్లింపులు జరుగనున్నాయి. ఈనెల21న బ్యాంకుఖాతాలకు రూ.85వేలను పంపనున్నట్లు సింగరేణియాజమాన్యం సర్క్యులర్‌లో పేర్కొన్నది. రిటైర్డ్ కార్మికులు/నామినీలకు లాభాలవాటా, దీపావళి బోనస్ చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని అన్ని ఏరియాల జీఎంలు, పర్సనల్ అధికారులకు జీఎం(పర్సనల్) ఉత్తర్వులు జారీ చేశారు.


రిటైర్డ్‌కార్మికులకు లాభాలవాటా,బోనస్: సీతారామయ్య

మంచిర్యాల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ కార్మికులకు 32శాతం లాభాలవాటా, దీపావళి బోనస్ చెల్లించేందుకు యాజమాన్యం సర్క్యులర్లు జారీ చేసిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న లాభాల వాటా, 21న దీపావళి బోనస్ వచ్చే నెల 2న వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లిస్తారని, రిటైర్డ్ కార్మికులు గమనించాలని ఆయన కోరారు.

యాజమాన్యానికి కృతజ్ఞతలు..

మందమర్రి టౌన్: రిటైర్డు కార్మికులందరికీ దీపావళిబోనస్, లాభాలవాటా, ఏరియర్స్ చెల్లించడానికి అంగీకరించడంపట్ల యాజమాన్యానికి రుణపడి ఉంటామని రిటైర్డు కార్మికసంఘం నాయకులు వాసాల శంకర్, రాం రవిందర్, రేణికుంట్ల కొమురయ్య, బొలిశెట్టి రాజయ్య తెలిపారు. బుధవారం మందమర్రిలో అంబేద్కర్ విగ్రహం వద్ద వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా లాభాల వాటా, దీపావళి బోనస్ లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.తమ బాధలను విన్నవించి యాజమాన్యం స్పందించడం తమకు ఆనందంగా ఉందని తెలిపారు. దీని వల్ల తాము, తమ కుటుంబాలు యాజమాన్యానికి రుణపడి ఉంటాయన్నారు.







క్రీడల్లో గెలుపోటములు సహజం

దండేపల్లి,జనవరి 17: క్రీడల్లోగెలుపొటములు సహజమని కాంగ్రెస్‌పార్టీ మండల ప్రధానకార్యదర్శి కంది సతీష్ అన్నారు. కంది నరేష్, సందేల శశాంక్ స్మారకార్థం తాళ్లపేటలో జడ్పీ ఉన్నతపాఠశాలలో మండలస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. తాళ్లపేట జట్టు విజయం సాధించింది. విజేతకు రూ5వేలు, రన్నరప్‌గా నిలిచిన రాజుగూడ జట్టుకు రూ. 2,500 చెక్కుతో పాటు ట్రోఫీని అందజేశారు.

బియ్యం తక్కువ రాకుండా చూడాలి

నస్పూర్, జనవరి 17: రేషన్ బియ్యం బస్తాలో 50కిలోలు కచ్చితంగా ఉండే విధంగా తూకంవేసి ఇవ్వాలని పలువురుడీలర్లు బుధవారం నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్‌లో గల ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నస్పూర్ మండల రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షుడు సల్ల రవికుమార్, వివిధ ప్రాంతాలకు చెందిన డీలర్లు అంకం మనోజ్, అంకం తిరుపతి, భూర్ల మహేందర్, బానేష్, అరుముల్ల పోశం, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

హాజీపూర్, జనవరి 17: ఎమ్మార్పీఎస్ హాజీపూర్ మండల కమిటీని జిల్లాఇన్‌చార్జి గుండాథామస్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. మండలఅధ్యక్షుడిగా ఎల్కటూరి రాజేష్, ఉపాధ్యక్షుడిగా ఎల్కటూరి శ్రీని వాస్, ప్రధానకార్యదర్శిగా మల్యాల తిరుపతి, ప్రచారకార్యదర్శిగా అడ్లూరి వంశీ, కోశాధికారిగా మల్యాల నర్సయ్యతదితరులను ఎన్నుకున్నారు.

బుగ్గ పుణ్యక్షేత్రంలో ఆదివాసీల పూజలు

సిర్పూర్(యు), జనవరి 17: సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల సరిహద్దు అటవీప్రాంతంలో గల బుగ్గజల పుణ్యక్షేత్రంలో బుధవారం ఆదివాసీలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. పుష్యమాసం ఆదివాసీలకు పవిత్ర మాసం. ఇందులో భాగంగానే రెండు మండలాల ఆదివాసీలు బుగ్గజలదేవుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.కార్యక్రమంలో కుంరం భీం మనవడు సోనేరావు, సర్పంచ్‌లు పెందోర్ నాగోరావు, ఆర్కనాగోరావు పాల్గొన్నారు.


ప్రతి ఇంటి గోడపై శ్రీరామనామం

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 17: ఈనెల22న అయోధ్యలో రామాల యం ప్రారంభంకానున్న నేపథ్యంలో హిందూవాహిని సభ్యుడు కిరణ్ నేతృత్వంలో జిల్లాకేంద్రంలో ప్రతిఇంటిగోడపై శ్రీరామనామం ప్రచురిస్తు న్నారు. హర్‌ఘర్ రామనామం పేరుతో ముద్రలు వేస్తున్నట్లు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలి

కౌటాల, జనవరి 17: యువత క్రీడల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగా లని సీఐ సాదిక్‌పాషా అన్నారు. బుధవారం మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని బహుమతులు ప్రదానంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో క్రీడల్లో ఎంతో ప్రతిభదాగి ఉందన్నారు. యువత, ఉద్యోగాల సాధనలోఉన్న అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేం దుకు పోలీసులు ఎళ్లవేళలా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.





ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టులల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

» ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్త్‌కు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించినన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సొహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్.దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్న సాగర్ కడితే సరిపోయేది

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్థూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందదని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్లు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజీత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్గాగా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే నెంబర్ 66లో 2009-10 పహాణీ ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాలతోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఆర్డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డెయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబుచులాడుతుండగా మధ్యలో సందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల నియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్ల పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసు కునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!


(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

ప్రధానమంత్రి పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 17: పాలనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ ఉద్యోగులు (సివిల్ సర్వెంట్స్)కు అందించేందుకు ప్రధానమంత్రి పురస్కారాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం సంయుక్త కార్యదర్శి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌కార్యాలయం నుంచి హాజరయ్యారు. క్యాటగిరి 1లో 12 ప్రాధాన్యత రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి 10 అవార్డులు, క్యాటగిరి 2 లో 6 అవార్డులు అందించనున్నామని తెలిపారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 17: వాహనదారులు, పాదాచారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జిల్లా రవాణాశాఖ అధికారి కిష్టయ్యతో కలిసి 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు -2024 బ్యానర్లు, గోడ ప్రతులు, స్టిక్కర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారాసురక్షితమైన ప్రయాణం చేయవచ్చన్నారు. ఫిబ్రవరి 14వ తేదీ వరకు జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించనున్నామని చెప్పారు. రోడ్డు బద్రతపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నామన వివరించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని చెప్పారు. మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడప వద్దని సూచించారు. ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరవేసే ఆటోలు, జీపులు, ఇతర ప్రైవేటు వాహనాలు పరిమితికి మించి తీసుకెళ్లకూడదని తెలిపారు.

ఫొటో ఓటరు జాబితా రూపకల్పనకు శిబిరాలు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 17: స్పష్టమైన ఫొటో ఓటరు జాబితా రూపకల్పనకు 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాలు నిర్వహించనున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 8 వరకు నిర్వహించనున్న ఫొటో ఓటరు జాబితా ప్రత్యేక కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. 18 ఏళ్లపై బడిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

దశల వారీగా అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

నెన్నెల, జనవరి 17: నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు దశలవారిగా పనులు చేపడతామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండలంలోని లంబాడితండా, గొల్లపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పర్యటించి అన్ని సమస్యలను గుర్తిస్తున్నామన్నారు. అవసరమైన పనులను గుర్తించేందుకు ఇప్పటికే అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని బెల్లంపల్లికి ఆహ్వానించి ఇక్కడి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. బెల్లంపల్లికి నిధుల కేటాయింపులో ప్రాధన్యాత ఇస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. అభివృద్ధి పనుల కోసం రూ. 10 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో అవరమైన చోట అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతిని. ధులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీలు బొమ్మెన హరీష్‌గౌడ్, దాగం రమేశ్, శిరీష, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గట్టు మల్లేష్, నెన్నెల, కుశ్నపల్లి సర్పంచులు తోట సుజాతశ్రీనివాస్, సంధ్యా మహేష్, ఎంపీడీవో వరలక్ష్మి, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, రేంజీ అధికారి గోవిం ద్‌చంద్ సర్దార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంజన్ననుదర్శించుకున్న ఎమ్మెల్యే

మల్యాల, జనవరి 17: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అధికారులు సత్కరించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు.

బండరాళ్లను తరలించొద్దు

- తహసీల్దార్‌కు ఆదివాసీ సంఘం నాయకుల వినతి

కాసిపేట, జనవరి 17: మండలంలోని రొట్టిపల్లి ఏజెన్సీ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా బండరాళ్లను తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు బుధవారం మండల తహసీల్దార్ భోజన్నకు వినతి పత్రం అందించారు. తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు మాట్లాడుతూ గత కొంత కాలంగా రొట్టిపల్లి ఏజెన్సీ ప్రాంతం నుంచి కొంతమంది ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా బండరాళ్లను తరలిస్తున్నారన్నారు. దీన్ని అడ్డుకుని అక్రమంగా బండరాళ్లను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుర్సెంగ తిరుపతి, సిడాం రమేష్, మేంద్రపు రాజన్న, పెంద్రం రాజశేఖర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

నెన్నెల, జనవరి 17: యువత క్రీడలపై దృష్టి సారించాలని ఎస్సై శ్యామ్‌పటేల్ అన్నారు. సుంకరి పుల్లమ్మ-బుచ్చయ్య స్మారకార్థం నెన్నెలలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి షెటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను బుధవారం రాత్రి ఎస్సై ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన 22 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువకులు క్రీడల పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. త్వరలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ ఇబ్రాహీం, ఎంపీటీసీ పురంశెట్టి తిరుపతి, సర్పంచ్ తోట సుజాత శ్రీనివాస్, నిర్వాహకులు సుంకరి శ్రీనివాస్, సుంకరి రవీందర్, సీనియర్ క్రీడాకారులు బాబా, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

చెన్నూరు, జనవరి 17: దివంగత మాజీ ఎమ్మెల్సీ సుల్తాన్ అహ్మద్, జంషీద్ ఆలీ స్మారక క్రికెట్ పోటీలను బుధవారం చెన్నూరు పట్టణంలోని ఖజిపూర్‌లో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాగా ఈ టోర్నమెంట్‌లో పట్టణం నుంచి 12 జట్లు పాల్గొన్నాయని పోటీల నిర్వాహకులు ముస్తక్ ఆలీ బ్రదర్స్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఏసీసీ, జనవరి 17: జవహర్ నవోదయ విద్యాలయ సంస్థల్లో 6వ తరగతిలో ప్రవేశం కోసంఈ నెల 20న నిర్వహించే ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో అధికారులతో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు లక్సెట్టిపేట, చెన్నూరు, మందమర్రి, బెల్లంపల్లిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షకు 1,188 విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 11.30 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి ఎవరిని అనుమతించవద్దని అధికారులకు సూచించారు. ఉదయం 10 గంటలలోగా విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ గొర్రెల పంపిణీ లేనట్లేనా?

- ఐదేళ్లుగా రెండో విడత కోసం ఎదురుచూపులు
- అయోమయంలో డీడీలు తీసిన లబ్ధిదారులు
- జిల్లాలో రూ. 7 కోట్ల పైచిలుకు సర్కారు ఖజానాకు



మంచిర్యాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సబ్సిడీ గొర్రెల పథకం జిల్లాలో పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోగా, డీడీలు తీసిన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ప్రాథమిక గొర్రెల సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరికీ 75 శాతం సబ్సిడీపై గొర్రెలను రెండేళ్లలోగా పంపిణీ చేస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. కాగా ఐదేళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టలేదు. దరావత్తు కింద నగదును బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

ఆర్థికంగా బలోపేతానికి..

రాష్ట్రంలోని గొల్ల, కుర్మలకు పథకం వర్తింపజేయడం ద్వారా ఆ ర్థికంగా బలోపేతం చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో సబ్సిడీ గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. పథకం ద్వారా ప్రాథమిక గొర్రెల సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న వాళ్లందరి నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. పథకంలో భాగంగా ప్రతి యూనిట్‌కు 20 గొర్రెలతో పాటు ఒక పొట్టేలును ఇవ్వాల్సి ఉంది. యూనిట్ వ్యయం రూ. లక్షా 25వేలుగా నిర్ణయించారు. అందులో లబ్ధిదారుడి వాటా కింద 25 శాతం చెల్లించాలనే నిబంధన విధించారు. దరఖాస్తు చేసుకున్న వారికి రెండు విడుతల్లో గొర్రెల పంపిణీ కోసం గ్రామాల వారీగా లబ్ధిదారులను ఎంపి క చేయాలని నిర్ణయించారు. లబ్ధిదారులకు డ్రాలో విజేతలకు మొదటి ఏడాది, మిగిలిన వారికి ఆ తరువాత సంవత్సరం యూనిట్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మొదటి విడత 2017-18లో పంపిణీ చేశారు. రెండో విడత 2018-19లో పంపిణీ చేయాల్సి ఉంది.

జిల్లాలో నాలుగు వేల మంది..

రెండో విడత గొర్రెల పంపిణీకి జిల్లాలోని దరఖాస్తుదారుల్లో 4,132 మంది గొల్ల, కుర్మలను అర్హులుగా ప్రకటించారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం ఒక్కో లబ్ధిదారుడి నుంచి 25 వాటా కింద రూ. 43,750 డీడీల రూపేణ ప్రభుత్వం వసూలు చేసింది. అందులో కేవలం 534 మంది లబ్ధిదారులకు మాత్రమే గొర్రెల పంపిణీ చేశారు. ఐదు సంవత్సరాలు గడుస్తున్నా మిగతా వారికి యూనిట్లు అందలేదు. రెండో విడత కోసం జిల్లాలోని 4,132 మంది లబ్ధిదారులు రూ. 43,750 చొప్పున మొత్తం రూ. 7 కోట్ల మేర డీడీలు తీసి ప్రభుత్వానికి అందజేశారు. నాలుగేళ్లుగా యూనిట్లు అందకపోగా, డీడీల రూపేణా ప్రభుత్వ ఖజానాకు జమ చేసిన సొమ్ము సైతం తిరిగి చెల్లించకపోవడంతో గొల్ల, కుర్మలు ఆందోళనకు గురవుతున్నారు. రెండో విడత యూనిట్ల పంపిణీ కోసం అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

మరోవైపు ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అసలు ఆ పథకాన్ని కొనసాగిస్తారో...లేదోనన్న అనుమానం లబ్ధిదారుల్లో నెలకొంది. ఐదేళ్ల కిందట రెండో యూనిట్ కోసం డీడీలు ఆహ్వానించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్ల అనం తరం ఎన్నికల కోడ్ సాకు చూపి పథకాన్ని అమలు చేయలేదు. స్వీకరించిన డీడీలు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి.

ఐదు సంవత్సరాలుగా పెండింగ్...

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా రెండో విడుత గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, ఐదేళ్లు గడుస్తున్నా లబ్ధిదారు లకు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. ఇదిలా ఉండగా 2018లో తిరిగి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం యూనిట్లు పంపిణీ చేస్తుందని లబ్ధిదారులు ఎదురు చూశారు. కాగా నాలుగేళ్లుగా ఆ ఊసే ఎత్తని అప్పటి ప్రభుత్వం రేపు మాపంటూ కాలం వెళ్లదీసింది. చివరిగా 2023 అసెంబ్లీ దగ్గరపడుతుండడంతో సంవత్సరం క్రితం రెండో విడత గొర్రెల పంపిణీ చేపడతామని మరోమారు ప్రకటించింది. యూనిట్ వ్యయాన్ని రూ. లక్షా 25 వేల నుంచి రూ. లక్షా 75 వేలకు పెంచింది. దీంతో లబ్ధిదారులు తమ వాటా కింద రూ. 43,750లు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోదారి రమాదేవి

జైపూర్, జనవరి 17: అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ గోదారి రమాదేవి అన్నారు. జైపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గోదారి రమాదేవి అధ్యక్షతన గ్రామ అభివృద్ధి ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళికలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలన్నారు. మండలం, గ్రామపంచాయతీల స్థాయిలో ఆర్థిక, సామాజిక, అత్యవసర సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో స్థానిక వనరులను గుర్తించి అభివృద్ధి ప్రనాళికలు తయారు చేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి ప్రణాళికలు ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్, సిబ్బంది సంజీవస్వామి, సచిన్, పంచాయతీ కార్యదర్శులు , సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని బుయ్యారం, జిల్లెడ, సూరారం గ్రామాల్లో సర్పంచులు గోగర్ల శ్రీనివాస్,చీర్ల కొండల్‌రెడ్డి, పల్లె రమేశ్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామపంచాయతీల స్థాయిలో ఆర్థిక, సామాజిక, అత్యవసర సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో స్థానిక వనరులను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలని కోరారు. ఎంపీడీవో లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు నిర్దేశించిన గడువులోగా ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపు, ఏవో వీరయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, కార్యదర్శులు చంద్రమౌళి, హరినాథ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: ప్రణాళికలతో ముందుకు వెళితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని దాంపూర్, ఖాజీపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామ అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఉండే విద్య, వైద్యం,వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, అటవీ అంశాలతో పాటు ఇతర అంశాలపై 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్ ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు సంతోషం భాస్కర్‌రెడ్డి, తిరుపతి, వార్డు సభ్యులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

హాజీపూర్, జనవరి 17: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని మంచిర్యాల జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య అన్నారు. బుధవారం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.

ఆలయ రినోవేషన్ కమిటీ అధ్యక్షుడి రాజీనామా

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 17: మంచిర్యాల విశ్వనాథ ఆలయ రినోవేషన్ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న దొంతుల ముకేష్ తన పదవీకి రాజీనామా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ నుంచి ఎంపికైన ఆయన ఈవో రవికి బుధవారం రాజీనామా లేఖను సమర్పించారు.

20న ఉచిత శిక్షణ శిబిరం

బెల్లంపల్లి, జనవరి 17: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఈ నెల 20న ఔత్సాహిక సినీ, టీవీ రచయితలకు మంచిర్యాల జిల్లా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా సంస్కృతిక సమాఖ్య చీఫ్ కో ఆర్డినేటర్ హనుమాండ్ల మధుకర్, శిక్షణ శిబిరం చీఫ్ కోఆర్డినేటర్ అభినవ సంతోష్‌కుమార్ అన్నారు. పట్టణంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వివరాల కోసం 8074771108, 9908232303 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో నృత్యకళా సమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్, కొరియోగ్రాఫర్, పంబాల మల్లేష్, జంజిరాల దినేష్‌కుమార్, బొంకూరి రాంచందర్, మల్లేష్, రాజేష్, రవికుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి పాదుకలకు పూజలు

దండేపల్లి, జనవరి 17: దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం అయోధ్య రాములోరి పాదుకలతో పాదయాత్రతో వచ్చి భక్తులు సత్యదేవుడిని దర్శిం చుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం శోభా యాత్ర చేపట్టారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి క్యారమ్ జట్టు ఎంపిక పోటీలు

బెల్లంపల్లి, జనవరి 17: తెలంగాణ రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో రాష్ట్ర స్థాయి క్యారమ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్ బాలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి రాజన్నలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94400 10404లో సంప్రదించాలని కోరారు.

లారీ, కారు ఢీ.. ఆరుగురికి స్వల్ప గాయాలు

మందమర్రిటౌన్, జనవరి 17 : పట్టణంలోని జాతీయ రహదారి దేవాపూర్ రైల్వే గేటు రోడ్డు వద్ద బుధవారం లారీ, కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. రెబ్బెనకు చెందిన సురేష్ కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో మంచిర్యాలలోని ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. గేటు వద్దకు రాగానే వెనక నుంచి మంచిర్యాల వైపు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. లారీ డ్రైవర్‌ను పట్టుకుని సురేష్, అతని కుటుంబీకులు చితకబాదారు. స్థానికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. రోడ్డు మధ్యలో ప్రమాదం జరుగడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కొత్త మామిడిపల్లిలో వికాసిత్ భారత్ సంకల్పయాత్ర

దండేపల్లి, జనవరి 17: మండలంలోని కొత్తమామిడిపల్లిలో బుధవారం బీజేపీ నాయకులు వికాసిత్ భారత్ సంకల్పయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికారి ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, సర్పంచు గడ్డం రాజయ్య, నోడల్ అధికారి అనిల్‌కుమార్, వివిధ శాఖల సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీనివాస్

ఏసీసీ, జనవరి 17: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మంచిర్యాల జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా కన్నెపల్లి మండలంలోని కుర్మగూడెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మోకెనపల్లి శ్రీనివాస్ నియమితుయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సంఘం పటిష్టతకు పాటుపడుతామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తాండూర్, జనవరి 17: మండలంలోని రేపల్లెవాడ సెయింట్ థెరిస్సా పాఠశాల సమీ పంలో బుధవారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజిత్‌కుమార్ (18) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. తాండూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన అంజిత్‌కుమార్ తన బైక్‌పై ఐబీ తాండూర్ వైపుకు వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో అంజిత్‌కుమార్ బైక్‌తో సహా పక్కన వస్తున్న ఐచర్ వ్యాన్ టైర్ల కింద పడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అంజిత్‌కుమార్ తండ్రి కందుగుల బాపురావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య

హాజీపూర్, జనవరి 17: మండలంలోని నంనూర్ ఆర్అండ్ఆర్ కాలనీలో చదువు మానేసి సమయం వృథా చేస్తున్నామని కొడుకును తండ్రి మందలించడంతో బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నంనూర్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఉప్పులేటి సుధాకర్ తాపీ మేస్త్రీగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుధాకర్ కుమారుడు ఉప్పులేటి సాగర్(18) మంచిర్యాలలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సాగర్ చదువుమానేసి జులాయిగా తిరుగుతుండడంతో బుధవారం తల్లిదండ్రులు చదువుకోవాలని గట్టిగా మందలించి పనులకు వెళ్లిపోయారు. దీంతో మనస్తాపం చెందిన సాగర్ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు ఇంటికి వచ్చిచూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న సాగర్‌ను స్థానికుల సహాయంతో కిందకు దించగా అప్పటికే మృతిచెందాడు. సాగర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు పూర్తి

బెల్లంపల్లి, జనవరి 17: జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి అయ్యింది. ఈ నెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను జిల్లా వ్యాప్తంగా ప్రారంభించారు. సుమారు 200 మందికి పైగా కంప్యూటర్ ఆపరేటర్లను సంబంధిత అధికారులు ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్ నమోదును కొనసాగించారు. జిల్లా వ్యాప్తంగా 2,58,213 మంది దరఖాస్తు లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. బెల్లంపల్లి మండలంలో 9291, భీమా రంలో 5339, భీమినిలో 5183, చెన్నూరులో 10,900, దండేపల్లిలో 17,626, హాజీపూర్‌లో 11,321 దరఖాస్తులు వచ్చాయి. జైపూర్‌లో 11,746, జన్నారంలో 18,795, కన్నెపల్లిలో 8585, కాసిపేటలో 10,181, కోటపల్లిలో 11,652, లక్సెట్టిపేటలో 10,331, మందమర్రిలో 4748, నెన్నెలలో 8132, తాండూర్‌లో 10,746 దరఖాస్తులు ఆన్‌లైన్ చే శారు. వేమనపల్లిలో 6349, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 15,534, చెన్నూరు మున్సిపా లిటీలో 7330, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 9086, లక్సెట్టిపేట మున్సిపాలిటీలో 6767, మంచిర్యాల మున్సిపాలిటీలో 29,801, మందమర్రి మున్సిపాలిటీలో 13,659, నస్పూర్ మున్సిపాలిటీలో 17,111 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు మా ట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నమోదు ప్రక్రియకు సంబం ధించి ఆయా కేంద్రాలను పరిశీలించామని తెలిపారు.

ప్రతిపాదనలకే పరిమితం

- ప్రారంభానికి నోచుకోని జంక్షన్ల పనులు
- మూడు చోట్ల చేపట్టేందుకు అధికారుల నిర్ణయం



సీసీసీ కార్నర్ చౌరస్తా

నస్పూర్, జనవరి 17: నస్పూర్ మున్సిపాలిటీలోని 63వ జాతీయ రహదారిపై తోళ్ళవాగు నుంచి శ్రీరాంపూర్ కాలనీ వరకు మూడు చోట్ల కూడళ్లను విస్తరించి జంక్షన్లను నిర్మించాలన్న ప్రతిపాదన ఇంకా టెండర్ల దశకు చేరలేదు. మున్సిపాలిటీలోని సీసీసీ కార్నర్, కలెక్టరేట్ చౌరస్తా, శ్రీరాంపూర్ కాలనీ ఎన్‌టీఆర్ చౌరస్తాల్లో పట్టణ ప్రగతి నిధుల నుంచి కోటి రూపాయల చొప్పున ప్రతిపాదించారు. జాతీయ రహదారిపై వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా జంక్షన్లు నిర్మించాలని నిర్ణయించారు. జంక్షన్లను ఏర్పాటు చేసి అందులో వాటర్‌ఫాల్స్‌మౌంట్స్, వివిధ రకాల పక్షుల బొమ్మలు, అడవుల రక్షణ, మొక్కల పెంపక ప్రాధాన్యత, సంస్కృతి సంప్రాదాయ వివిధ చిహ్నాలు తదితర వాటి ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పనులు మొదలు కావాల్సి ఉండగా అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ముందుకు సాగలేదు. కాగా డిజైన్లు ఎంపిక ప్రక్రియ పూర్తి కాగానే టెండర్‌కు పిలుస్తామని అధికారులు చెబుతున్నారు. సీసీసీ కార్నర్, తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద దాదాపు 12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియంత్రణ సిగ్నల్స్ పనిచేయక పోవడంతో అలంకారప్రాయంగా మారాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం వల్ల అడ్డదిడంగా ద్విచక్ర వాహనదారులు రోడ్డు క్రాస్ చేయడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం..



సీసీసీ కార్నర్, కలెక్టర్ చౌరస్తా, శ్రీరాంపూర్ కాలనీల్లో ఏర్పాటు చేసే జంక్షన్లను త్వరలోనే పూర్తి చేస్తాం. జంక్షన్ల ఏర్పాటు చేసే డిజైన్లు, లోగోలను ఎంపిక చేయాల్సి ఉంది. ఆది పూర్తి కాగానే టెండర్లు పిలిచి మూడు నెలల్లో పనులు పూర్తి చేస్తాం.

- రమేశ్, మున్సిపల్ కమిషనర్